సచివాలయ సేవలపై శీతకన్ను

- వైఎస్సార్ సీపీ హయాంలో 545 రకాల సేవలు
- నేడు తెరచుకోని వెబ్ సైట్లు
- నిర్వీర్యానికి కూటమి ప్రభుత్వం కుట్ర
- ప్రజలకు తప్పని ఇబ్బందులు



జి.మామిడాడలోని గ్రామ సచివాలయం

పెదపూడి: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి ఎంతో మంది పేద ప్రజలకు అండగా నిలిచింది. అయితే అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటికి తూట్లు పొడుస్తోంది. ఇప్పటికే వలంటీర్ల వ్యవస్థను కుదేలు చేసిన ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను సైతం నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నింది. జగనన్న పాలనలో సచివాలయాల నుంచి ప్రజలకు 545 రకాల సేవలు అందేవి. నేడు ఆ పరిస్థితి లేకుండా పోయింది. అంతా గందరగోళంగా మారింది. ప్రభుత్వం ఏర్పాటై ఐదు నెలలు దాటినా రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు మంజూరు కాలేదు. ఆరోగ్యశ్రీ కార్డుల వైబ్‌సైట్లు ఇంతవరకు ఓపెన్ కాలేదు. ఫలితంగా అనేక మంది దరఖాస్తుదారులు నానా అవస్థలు పడుతున్నారు.

నియోజకవర్గంలో..

నియోజకవర్గంలో అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల్లో 58 గ్రామాలు ఉన్నాయి. వీటిలో 79 సచివాలయాలు ఉన్నాయి. సుమారు 584 మంది సచివాలయ ఉద్యోగులు ప్రస్తుతం పని చేస్తున్నారు.

నాడు కళకళ... నేడు వెలవెల..

గ్రామాల్లో ప్రస్తుతం సచివాలయాల నుంచి ప్రజలకు సేవలందక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు సచివాలయ ఉద్యోగులు పనిలేక ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. మండల పరిధిలో రెండు వేల జనాభా ఉన్న గ్రామంలో సుమారు రూ. 40 లక్షలు వెచ్చించి సచివాలయ భవనం నిర్మించారు. నిన్నటి వరకు వివిధ సంక్షేమ పథకాలు పొందేందుకు ప్రజల రాకపోకలతో కళకళలాడిన కార్యాలయాలు నేడు వెలవెల బోతున్నాయి.

సచివాలయ ఉద్యోగులే దిక్కు

నాడు కూటమి ప్రభుత్వ నేతలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సచివాలయ ఉద్యోగుల పట్ల వివక్షతతో అనేక విమర్శలు చేశారు. అవహేళనగా మాట్లాడారు. అయితే నేడు కూటమి ప్రభుత్వం పింఛన్ల పంపిణీకి సచివాలయ ఉద్యోగులే దిక్కుగా మారారు. అంతేగాక ఇటీవల కూటమి ప్రభుత్వం చేపట్టిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో స్టిక్కర్లు అంటించే దగ్గర నుంచి, ఇంటింటి ప్రచారం వరకు వీరినే ఉపయోగించి వారి ఆత్మ గౌరవాన్ని దెబ్బ తీశారంటూ ఆరోపణలు వినిపించాయి.

నిరంతర సేవలు అందించాలి



ప్రజలకు అవసరమయ్యే సేవలు నిరంతరం అందించాలి. రైస్‌కార్డు, ఫించన్ వంటి వాటిని పొందేందుకు ప్రజలు సచివాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలి.

– సాంబత్తుల చంటి, కాండ్రేగుల గ్రామం.

ఫ్లెక్సీల తొలగింపు


రాజానగరంలో ఫ్లెక్సీలను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

రాజానగరం: బడా రాజకీయ వేత్తలతో పాటు చోటా నాయకులు, స్నేహితుల పుట్టినరోజు, ఇతర ముఖ్యమైన వేడుకలను పండగలా జరుపుకోవడం ప్రస్తుతం సాధారణంగా మారింది. దీనిలో భాగంగా ముందుగా భారీ ఎత్తున ఫ్లెక్సీలు కడుతున్నారు. దీంతో ఇవి రోడ్లకు ఇరువైపులా ఎప్పుడూ దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు నగరా మోగడంతో కోడ్ అమల్లోకి వచ్చింది. దీనితో రాజానగరంలో పాత జాతీయ రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన వివిధ ఫ్లెక్సీలను పంచాయతీ సిబ్బంది తొలగిస్తున్నారు. రాజకీయ నాయకులు, పార్టీలతో సంబంధం లేకుండా అన్నింటినీ తీసివేసి గ్రామ సచివాలయం వద్దకు ఒకవైపు చేరవేస్తున్నారు.

14 నుంచి వారోత్సవాలు

మధురపూడి: గ్రంథాలయాల్లో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకూ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కోరుకొండ శాఖా గ్రంథాలయాధికారి వీవీ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ప్రకటన విడుదల చేశారు. 14న బాలల దినోత్సవం (దివంగత ప్రధాని నెహ్రూ జయంతి), 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ సభ, 17న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, 18న చిత్రలేఖనం పోటీలు, 19న దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతి, 20న బహుమతుల ప్రదానోత్సవం జరుగుతుందన్నారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న అఖండ భజన


రంగంపేట శివాలయంలో భజన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సభ్యులు

రంగంపేట: మండలకేంద్రం రంగంపేట గ్రామంలో స్థానిక మంచినీటి చెరువు వద్ద కొలువైన ఉమా రామలింగేశ్వరస్వామి దేవాలయంలో అఖండ భజన కొనసాగుతున్నట్టు గ్రామ మాజీ ఉప సర్పంచ్ పోతుల వీర సుందరరావు తెలిపారు. మంగళవారం కార్తిక శుద్ధ ఏకాదశి సందర్భంగా కార్యక్రమాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభించడం జరిగిందన్నారు. మంగళవారం తెల్లవారు జాము 4.30 గంటల నుంచి బుధవారం తెల్లవారు జాము 4.30 గంటల వరకు వివిధ భజన బృందాల ఆధ్వర్యంలో నామ సంకీర్తన జరుగుతుందన్నారు.

నేడు అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు మండల పరిషత్ కార్యాలయం వద్ద గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వి.శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొనాలని కోరారు.

రాజానగరం: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలోని సమావేశపు హాలులో బుధవారం జీపీడీపీ, బీసీడీపీ, డీపీడీసీ శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఝాన్సీ తెలిపారు. జిల్లా ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ శిక్షణకు మండలంలోని విస్తరణాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఐసీడీఎస్, ఎన్ఆర్ఈజీఎస్, సెర్ప్, వెటర్నరీ, ప్రాథమిక ఆరోగ్య శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లు, వీఓ అధ్యక్షులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు.

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం జీపీడీసీ శిక్షణ నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ బత్తిన అశోక్ కుమార్ తెలిపారు. ఉదయం 9 గంటలకు శిక్షణ ప్రారంభమవుతుందన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

సీతానగరం: మండలంలోని చినకొండేపూడి, రాపాక గ్రామాల్లోని పీఏసీఎస్‌ల వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ శ్రీనివాస్, ఏడీఏ మల్లికార్జునరావు ఏవో కె.సూర్య రమేష్, ఎంఎస్‌వో లక్ష్మి మంగళవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఎంటీయూ 1318, పీఎల్ఏ 1100 రకం ధాన్యాన్ని కొనుగోలు చేస్తారన్నారు. 100 కిలోలకు రూ.2,300, 75 కిలోలకు రూ.1,725 చెల్లిస్తారన్నారు. ధాన్యంలో తేమ 17 శాతానికి మించి ఉండరాదన్నారు.

ఆధ్యాత్మిక జీవనంతో జన్మ సాఫల్యం


పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి దంపతులు

అనపర్తిలో ఆకాశదీపం కార్యక్రమాన్ని నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే దంపతులు

పెదపూడి: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకొని జీవితాలను సార్థకత చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తి గ్రామ పాతఊరులోని శ్రీదేవి భూదేవి సమేత జనార్ధనస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద శాస్త్రోక్తంగా పూజలు చేసి ఆకాశదీపం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నల్లమిల్లి సీతారామిరెడ్డి, నల్లమిల్లి వెంకట మునీశ్వరరెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మహాదివ్య లింగార్చనలో మాజీ ఎమ్మెల్యే పూజలు

పెదపూడిలో హనుమాన్‌దళ్ అధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాదివ్య లింగార్చన మహోత్సవానికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి హాజరై మంగళవారం స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మహా దివ్యలింగార్చన సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గుత్తుల రమణ, పార్టీ శ్రేణులు ఎం.నాగరాజు, కాకర సాయిబాబు, ఈదేటి రాంబాబు, మహాదివ్య లింగార్చన కమిటీ ప్రతినిధులు గోపాలకృష్ణ, రవి, సతీష్, గోవిందరాజు, అప్పలాచార్యులు,అఖిల్, నాగరాజు, వెంకటేష్, రామకృష్ణ, శ్రీరాములు పాల్గొన్నారు.


స్వామిని దర్శించుకొంటున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

బెల్టు విక్రయాలను అరికడతాం



శ్రీనివాస బాలాజీ, ఎక్సైజ్ సీఐ

మధురపూడి: సారా, బెల్టుషాపుల ద్వారా మద్యం విక్రయాలను అరికడతామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కోరుకొండ సీఐ శ్రీనివాస బాలాజీ అన్నారు. ప్రభుత్వ ఆదేశాల్లో భాగంగా బెల్టు షాపుల్లో విక్రయాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. దానిలో భాగంగా ఇటీవల పలుచోట్ల దాడులు నిర్వహించామన్నారు. సీతానగరం మండలం మిర్తిపాడులో 18, పురుషోత్తపట్నంలో 35 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు తెలిపారు. మద్యం షాపుల తాత్కాలిక అనుమతులు ఈ నెల 15వ తేదీతో ముగిసి, పర్మినెంట్ షాపులు ఏర్పాటవుతాయన్నారు. కోరుకొండ సర్కిల్ పరిధిలో 11 మద్యం షాపులు ఉన్నట్టు తెలిపారు. వాటిలోని కోరుకొండ మండలంలో నాలుగు షాపులకు మూడు, గోకవరం మండలంలో ఐదు షాపులకు మూడు, సీతానగరం మండలంలో రెండు షాపులు పర్మినెంట్‌గా ఏర్పాటువుతాయన్నారు. వాటికి దీర్ఘకాలిక అనుమతులు వర్తిస్తాయన్నారు.

అబ్దుల్ కలాం అవార్డుకు కృష్ణమోహన్ ఎంపిక



మధురపూడి: కోరుకొండ మండలం నరసాపురానికి చెందిన ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకుడు కె.కృష్ణ మోహన్‌ను రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం జాతీయ అవార్డుకు ఎంపిక చేశారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో గురువారం జరిగే కార్యక్రమంలో ఆయనకు అవార్డు ప్రదానం చేయనున్నారు. కృష్ణ మోహన్ చేస్తున్న సామాజిక కార్యక్రమాల నేపథ్యంలో సోమల రాజు ఫౌండేషన్ ఈ అవార్డుకు ఆయనను ఎంపిక చేసింది.

21న గాయత్రీ హోమం, అన్నసమారాధన

రాజానగరం: కార్తిక మాసం సందర్భంగా స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయం వద్ద ఈనెల 21న గాయత్రీ హోమం, కార్తిక అన్న సమారాధన నిర్వహించనున్నారు. అమలాపురంలోని రామానందస్వామి శిష్యపరివారం ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో 11 యజ్ఞ కుండీలను ఏర్పాటు చేసి, 44 జంటలతో ఉదయం 9 గంటల నుంచి గాయత్రీ హోమం నిర్వహిస్తారు. హోమంలో పాల్గొనే భక్తులకు హోమ ద్రవ్యాలను ఆలయ కమిటీ ఉచితంగా అందిస్తుంది. అనంతరం 11 గంటల నుంచి ఆలయం పక్కనే గల మండల ప్రజాపరిషత్ కార్యాలయ ప్రాంగణంలో కార్తిక అన్న సమారాధన నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాలకు భక్తులందరూ తరలిరావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


సదస్సులో మాట్లాడుతున్న లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ ప్రకాష్ బాబు

సీతానగరం: మహిళలు చట్టలపై అవగాహన పెంచుకోవాలని పలువురు వక్తలు అన్నారు. సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో జె.ఝాన్సీరాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, జిల్లా జడ్జి కె.ప్రకాష్ బాబు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ వివిధ వృత్తి పనులు చేసుకునే మహిళలకు విధాన్ సే సమాదాన్ ఆవశ్యకత తెలియజేశారు. సీనియర్ అడ్వకేట్ పద్మావతి మాట్లాడుతూ మహిళలు తాము పనిచేస్తున్న ప్రదేశంలో ఎదుర్కొనే ఇబ్బందుల పరిష్కారానికి ఉపయోగపడే హెల్ప్‌లైన్, చట్టాలను వివరించారు. అడ్వకేట్ వి.సుజాత మాట్లాడుతూ గృహహింస చట్టం గురించి తెలిపారు. డీసీపీవో రాజ్‌కుమార్ మహిళల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.భారతి, ఏసీడీపీవో పి.వరలక్ష్మి, ఇందిరా భారతి, ఎస్సై రామ్‌కుమార్, మహిళలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని జిల్లా జడ్జి, లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ ప్రకాష్ బాబు మంగళవారం పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అనే విషయాన్ని పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్ఎం వీరభద్రరావు, ఉపాధ్యాయులు కన్నూరి సతీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

న్యుమోనియాపై జాగ్రత్త అవసరం


న్యుమోనియాపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

సీతానగరం: శీతాకాలంలో వచ్చే శ్వాసకోశ వ్యాధి న్యుమోనియాతో జాగ్రత్తగా ఉండాలని సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఏసురాణి అన్నారు. సీతానగరంలో మంగళవారం నిమోనియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు ఏవీకే చైతన్య, ఎస్.రాజు, ఏసురాణి మాట్లాడుతూ ఈ వ్యాధి వల్ల ఐదేళ్లలోపు పిల్లలు, 60 ఏళ్లు పైబడిన వారికి ఎక్కువ ప్రమాదం ఉంటుందన్నారు. పిల్లలు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్నా, ముక్కు నుంచి ద్రవాలు కారుతున్నా, ఎడతెరిపిలేని దగ్గు వస్తున్నా, డొక్కలు ఎగురువేస్తున్నా, తీవ్ర జ్వరం, శరీరం నీలం రంగుకు మారుతున్నా అశ్రద్ధ చేయకుండా వెంటద్దాసుపత్రికి తీసుకువెళ్లాన్నారు. పిల్లలకు ఆరు నెలల వరకూ తల్లి పాలు ఇవ్వాలని, వ్యాధి నిరోధక టీకాలను క్రమం తప్పకుండా వేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో వైఎస్ రాయుడు, పీహెచ్ఎన్ ఆదిలక్ష్మి, సూపర్‌వైజర్ జి.దైవకృప, కె.సుధాకర్ పాల్గొన్నారు.

నిబంధనలకు లోబడే ఉచిత ఇసుక అందిస్తాం

సీతానగరం: నిబంధనలకు లోబడే వంగలపూడి ఓపెన్ రీచ్ నుంచి ఉచిత ఇసుక అందిస్తామని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ వంగలపూడి ఓపెన్ రీచ్ ద్వారా మాత్రమే ఇసుక తీసుకువెళ్లాలని, అనుమతులు లేని ర్యాంపు నుంచి ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. వంగలపూడి రీచ్ నుంచి గృహ నిర్మాణాలకు, మరమ్మతులకు ట్రాక్టర్ ద్వారా ఉచిత ఇసుకను నిబంధనలకు లోబడి పొందవచ్చన్నారు. ఇసుక అవసరమైన వారు ఇంటి వివరాలు, ఇసుక రవాణా కోసం వినియోగించే ట్రాక్టర్, డ్రైవర్ పూర్తి వివరాలను పంచాయతీ కార్యదర్శికి తెలియపరిచి, వారి నుంచి తీసుకున్న అనుమతి పత్రం అందించి ఉచిత ఇసుక పొందవచ్చన్నారు. డ్రైవర్ వద్ద డ్రైవింగ్ లైసెన్స్, ట్రాక్టర్ డాక్యుమెంట్లు తప్పని సరిగా ఉండాలన్నారు. అనవసరంగా ఇసుక డంపింగ్ చేయడం (స్టాక్ చేయడం), లావాదేవీలు చేయడం, లారీలపై లోడింగ్ చేయడంలో సహకరించడం, అధికారులు, సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సహస్ర జ్యోతిర్లింగార్చన



పందలపాకలో జ్యోతులు వెలిగిస్తున్న భక్తులు

బిక్కవోలు: మండలంలోని పందలపాక వినాయక నగర్‌కాలనీలో కొలువైన శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద సహస్ర జ్యోతిర్లింగార్చన నిర్వహించారు. సోమవారం రాత్రి ఆలయ కమిటీ ఆధ్వర్యంలోఅర్చకులు గరిమెళ్ల పవన్ సమక్షంలో ఈ కార్యక్రమం చేపట్టారు. మహిళలు పాల్గొని శివలింగ ఆకారంలో ఉన్న జ్యోతులను వెలిగించారు.

సాయిబాబాకు క్షీరాభిషేకం

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడిలో కొలువైన సాయిబాబాను రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బాబా వారికి 108 లీటర్లతో పాలతో క్షీరాభిషేకం, 108 కొబ్బరి కాయలు కొట్టారు. కార్యక్రమంలో ఆలయ గురువు మామిడిపల్లి రామారావు, కమిటీ నాయకులు కేశవరావు, గణపతి, శివ, పెద్ద పాల్గొన్నారు.

సాటివారిపై దయ చూపాలి


కార్యక్రమంలో పాల్గొన్న దైవజనులు

రంగంపేట: ప్రతి ఒక్కరూ సాటివారిపై ప్రేమ, దయ కలిగి ఉండాలని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు అన్నారు. మండల పరిధిలోని సుభద్రంపేట గ్రామంలో స్థానిక సెయింట్ పీటర్స్ లూథరిన్ చర్చిలో పాస్టర్ ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఏసుక్రీస్తు కనికరయుత కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దైవజనులు ఎ.సామ్యూల్‌రాజు, కృపారావు, మాణిక్యాలరావు, లూథర్‌ఫ్రెడ్రిక్ తదితరులు పాల్గొని ఏసుక్రీస్తు బోధనలు వివరించారు. కార్యక్రమానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి ఏసుక్రీస్తు విశ్వాసులు తరలివచ్చారు.